నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 3 నవంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

4 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్, వాలీబాల్ పోటీలు

భువనగిరి అర్బన్, నవంబర్ 20 : ఈ నెల 4 నుంచి ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ అథ్లెటిక్స్, వాలీబాల్ ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్, వాలీబాల్ క్రీడా పోటీలు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరుగుతాయని ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ రమణ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు పట్టణంలోని సీఎస్ఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మూడు రోజులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 4న బాల, బాలికలకు అథ్లెటిక్, 5న బాలికలకు వాలీబాల్, 6న బాలురకు వాలీబాల్ జరుగుతాయని చెప్పారు. ఈ పోటీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంటర్మీయట్ విద్యాశాఖ అప్లియేటెడ్ కాలేజీలన్నీ పాల్గొనాలన్నారు. అథ్లెటిక్స్ అండర్ -19 బాలుర, బాలికల పోటీలకు పూర్తి వివరాల కోసం జి.ఐలయ్య 98855 15530, వాలీబాల్ పోటీలకు పి.రమేశ్‌రెడ్డి 9963085686, ఎన్.ప్రసాద్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ 9848425657 ఫోన్ నంబర్‌లలో సంప్రదించాలని తెలిపారు.

ధాన్యం.. దైన్యం

ధాన్యం కొనుగోళ్లలో సర్కార్ అలసత్వం

పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కొన్ని చోట్ల మొదలు కాని కాంటాలు

ఎక్కడికక్కడ పేరుకుపోతున్న ధాన్యం

వర్షాలకు తడిసి ముద్దవుతున్న ఆరబెట్టిన వడ్లు

చేసేదేం లేక ప్రైవేట్‌లో తక్కువకే అమ్ముకుంటున్న రైతులు

కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం రాశులు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 2 : ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకపోవడం, అనాలోచిత నిర్ణయాలు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. రైస్ మిల్లర్ల అక్రమాలపై చర్యలు తీసుకునే అంశంపై దృష్టి సారించిన ప్రభుత్వం రైతులు పడుతున్న ఇబ్బందులు పట్టించుకోవడం లేదు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన ధాన్యం చేతికి అందినట్లే అంది చేజారుతున్నది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించిన తూకం వేయకపోవడంతో అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవుతున్నది. కొనుగోలు కేంద్రానికి 20 రోజుల క్రితం ధాన్యం తీసుకువచ్చినా తూకం వేయకపోవడంతో రైతులు ధాన్యకుప్పల వద్ద పడికాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం మందకొడిగా కొనసాగుతున్నది.

వర్షానికి తడిసిన ధాన్యాన్ని చూపెడుతున్న రైతు

పోచంపల్లిలో ఇలా

భూదాన్‌పోచంపల్లి మండలంలో 30 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో 28 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు రూ.160 కోట్ల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. పోచంపల్లి పీఏఈసీఎస్ పరిధిలో 16 కేంద్రాల్లో 40 వేల బ్యాగులు కొనుగోలు చేశారు. మరో ఏడు లక్షల బ్యాగుల ధాన్యం కాంటా వేయాల్సింది. జూలూరు పీఏసీఎస్ పరిధిలో 8 సెంటర్ల ద్వారా 2000 బస్తాలు కాంటాలు వేయగా, మరో నాలుగు లక్షల బస్తాల వరకు కాంటా వేయాల్సి ఉంది. ఆరు ఐకేపీ సెంటర్ల ద్వా రా 450 బస్తాలు కాంటా వేశారు. మరో మూడు లక్షల బ్యాగులు నిల్వ ఉన్నాయి.

6,12,790 మెట్రిక్ టన్నుల ధాన్యం రాక

ఈ వానకాలం సీజన్లో జిల్లాలో 2,81,885 ఎకరాల్లో వరి సాగైంది. 6,12,790 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు విక్రయించే అవకాశం ఉందంటూ పౌరసరఫరాల శాఖకు నివేదిక అందజేశారు. అందుకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా 323 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించారు. వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నా కొనుగోళ్లు ఊపందుకోలేదు. అనేక చోట్ల కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు జరుగడం లేదు. ధాన్యం కొనుగోలు చేస్తేనే రైతులకు సకాలంలో డబ్బులు చేరుతాయి. మరో 15 రోజుల్లో నార్లు పోసుకునే అవకాశం ఉంది. లేదంటే రైతులు డబ్బులకు ఇబ్బందులు తప్పవు.

మందకొడిగా రవాణా

ధాన్యం కొనుగోలు కోసం రైతులు ధాన్యపు రాశుల వద్ద నిరీక్షిస్తున్నారు. కేంద్రాల్లో అరకొరగా కొన్న ధాన్యాన్ని కూడా ఎప్పటికప్పుడు రవాణా చేయడం లేదు. రెండు మూడు రోజులకొకసారి లారీ ట్రాన్స్‌పోర్ట్ అవుతున్నది. ధాన్యం కొనుగోలు కాకపోవడంతో వలస వచ్చిన బీహార్ హమాలీలకు సైతం రోజుకు రెండు వందల రూపాయలు కూడా కూలి గిట్టుబాటు కావడం లేదు.

వర్షాలకు తడుస్తున్న ధాన్యం

ఆరుకాలం కష్టించి పండించిన రైతుకు చివరికి కన్నీళ్లే మిగులుతున్నాయి. సాగు కోసం వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి అప్పులు చేసి వరి పంటను సాగు చేస్తే అకాల వర్షాలతో నష్టాలు కలిగిస్తూ అప్పుల పాలు కావలసి వస్తుందని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దవుతున్నది. పోచంపల్లి మండలంలోని వంకమామిడి, పిలాయిపల్లి గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలతో ధాన్యం కుప్పల వద్ద నీరు చేరి ధాన్యం తడిసి ముద్దయింది. చౌటుప్పల్, రామన్నపేట తదితర మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ధాన్యం శుభ్రం చేసి ఆరపెట్టిన తడవడంతో మళ్లీ ఆరబెట్టడంతో వందలాది రూపాయలు కూలీల ఖర్చులు తప్పడం లేదు.

ప్రైవేట్ లో అమ్ముకుంటున్న రైతులు

ప్రభుత్వం ధాన్యం సేకరణకు రెండు రోజుల క్రితం రైతులకు అలాట్మెంట్ చేశారు. ప్రభుత్వం విధించిన నిబంధనలతో మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. వర్షాలతో ధాన్యం తేమ శాతం తక్కువగా ఉంటుంది. ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో కొందరు రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. క్వింటాలుకు 1800 రూపాయల నుంచి 2000 రూపాయల వరకు అమ్ముకుంటున్నారు.

ధాన్యం తీసుకొచ్చి 25 రోజులైంది

10 ఎకరాల వరి పంటను ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి 25 రోజులు అయింది . ధాన్యాన్ని తాలు చెత్త తొలగించేందుకు జేసీబీ గాలి మరల సాయంతో శుభ్రం చేసి. ప్రతిరోజు ధాన్యాన్ని ఎడబెడుతున్న. ధాన్యం కొంటలేరు. రోజూ వచ్చి పోతున్న. వర్షం వస్తే ధాన్యం తడుస్తుందని భయం అవుతుంది. ధాన్యాన్ని తొందరగా కొనుగోలు చేయాలి.

– గుర్రం బాల్‌రెడ్డి, రైతు గౌస్‌కొండ గ్రామం, భూదాన్‌పోచంపల్లి

8 బస్తాల ధాన్యం తడిసి మొలకెత్తింది

అకాల వర్షంతో తడిసి ఎనిమిది బస్తాల ధాన్యం తడిసి మొలకెత్తింది. 10 ఎకరాలు ఉన్న వరి పంట ధాన్యాన్ని ఇక్కడికి తీసుకొచ్చా. మొన్న కురిసిన వర్షానికి ధాన్యం కుప్పల వద్ద నీరు నిలిచింది. ఒక కుప్ప ధాన్యము శుభ్రం చేస్తే 3000 ఖర్చు అవుతుంది. రోజు కొనుగోలు కేంద్రానికి వచ్చి పోతున్నా.

– వాకిట నారాయణరెడ్డి, రైతు, గౌస్‌కొండ, భూదాన్‌పోచంపల్లి మండలం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 2 : ధరణి మాడ్యూల్స్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారులు, తాసీల్దార్లతో ధరణి, మీ సేవ, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, ఓటరు నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ధరణి మాడ్యూల్స్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి క్లియర్ చేయాలన్నారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిలో ఎన్ని పరిష్కరించారు, ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నాయని ఆరా తీశారు. పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కృష్ణారెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బొల్లేపల్లిలోని మెడికల్ షాపులో మందులను పరిశీలిస్తున్న జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ అశ్విన్‌కుమార్

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

- జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ అశ్విన్‌కుమార్

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 2 : మెడికల్ షాపుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని, లేనిచో కఠిన చర్యలు తప్పవని జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ అశ్విన్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం భువనగిరి మండలంలోని బొల్లేపల్లి గ్రామంలో పలు మెడికల్‌షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెడికల్ షాపుల నిర్వాహకులు నిబంధనలను తప్పక పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పలు షాపులకు నోటీసులు జారీ చేశారు.

రామన్నపేట: వెల్లంకి గ్రామంలో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇవ్వొద్దు

- వెల్లంకిలో అఖిలపక్ష నాయకుల రిలే నిరాహార దీక్ష

రామన్నపేట, నవంబర్ 2 : మండల కేంద్రం సమీపంలో నిర్వహించ తలపెట్టిన అదానీ గ్రూప్ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ తమకొద్దని, తమ ప్రాణాలకు ముప్పు తేవద్దని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో శనివారం అంబుజా సిమెంట్ కంపెనీకి ప్రభుత్వం అనుమతులు ఇవ్వొద్దని కోరుతూ అఖిలపక్ష నాయకులు రిలే నిరహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు వల్ల ప్రజలకు నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించి పరిశ్రమ ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని కోరారు.

నకిరేకంటి గణేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు జెల్లెల పెంటయ్య, ఎండీ రేహాన్, తాళ్లపల్లి సత్తిరెడ్డి, తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, తాటిపాముల శేఖర్, పోచబోయిన మల్లేశ్, మిర్జా ఫజల్‌బేగ్, గూనీ రాజు, తూడి సంజయ్, అవనగంటి నగేశ్, నకిరేకంటి నరేందర్, కుర్మ మహేందర్, కాకి శ్రీకాంత్, కట్ట మహేందర్, గుర్రం మహేశ్, బండ్ల హరీశ్, తాటిపాముల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి లాంచీ ప్రయాణం జెండా ఊపి ప్రారంభిస్తున్న నందికొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ తిరుమలకొండ అన్నపూర్ణ, టూరిజం అధికారులు

అలలపై సాగర్ టు శ్రీశైలం

- లాంచీ ప్రయాణం ప్రారంభం

నందికొండ, నవంబర్ 2 : నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలానికి లాంచీ ప్రయాణం ప్రారంభమైంది. నదీ మార్గంలో లాంచీ ప్రయాణానికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో శనివారం నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమలకొండ అన్నపూర్ణ, టూరిజం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింహ, మేనేజర్ హరిబాబు కలిసి లాంచీకి పూజలు నిర్వహించి జెండా ఊపి ప్రయాణాన్ని ప్రారంభించారు. నాగార్జునసాగర్ నుంచి ఉదయం 10 గంటలకు ప్రారంభమైన లాంచీ ప్రయాణం సాయంత్రం 4 గంటలకు శ్రీశైలం చేరుకుంటుంది. తిరిగి ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీశైలం నుంచి బయల్దేరి సాయంత్రం నాగార్జునసాగర్‌కు చేరుకుంటుంది. మొదటి రోజు 88 మంది ప్రయాణికులతో లాంచీ బయల్దేరింది. రెండు రోజుల పాటు అలలపై సాగే లాంచీ ప్రయాణికులకు జలపాతాలు, అటవీ ప్రాణులు, జింకలు, దుప్పులు, నదికి ఇరువైపులా నల్లమల కొండలు మధురానుభూతులను మిగులుస్తాయి. ప్రతి శనివారం నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలానికి లాంచీ ప్రయాణం ఉంటుందని, ప్రయాణికులకు హైదరాబాద్ నుంచి బస్సు, లాంచీలో భోజన సౌకర్యం ఉంటుందని టూరిజం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింహ తెలిపారు.

సీఎం రేవంత్‌ను కలిసిన ఎంజీయూ వీసీ

రామగిరి, నవంబర్2 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల వీసీలు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డితో కలిసి సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్‌లకు సీఎం దిశానిర్దేశం చేశారు. కొంత కాలంగా యూనివర్సిటీపైన నమ్మకం తగ్గుతుందన్న వాస్తవాన్ని గమనంలో ఉంచుకొని, యూనివర్సిటీలపై నమ్మకం కల్గించేలా పనిచేయాలని, గౌరవాన్ని పెంచాలని సూచించినట్లు ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి

- పోచంపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 2 : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీలో నేతాజీ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం నేతాజీ చౌరస్తా నుంచి తాసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తాసీల్దార్ నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దివాలా తీసే స్కీమ్‌లు ఎందుకు పెట్టారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. రైతు భరోసా పేరుతో ఎకరానికి ఏటా రూ.15వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కేసీఆర్ పెట్టిన 10వేల రూపాయలైనా ఇవ్వలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు అన్ని రకాల పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ అంటున్నారని అన్నారు. రైతు భరోసా ఇస్తామని చెప్పి రేవంత్‌రెడ్డి మోసం చేశారని, పరిపాలన దక్షతలేని ముఖ్యమంత్రికి అధికారం ఎందుకు ఇచ్చారని అన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తుందని విమర్శించారు. రైతు వ్యతిరేకి అయిన రేవంత్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో రైతులు రోడ్డు మీదికి రావలసిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లో పోసిన ధాన్యం కుప్పల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవుతుందని, ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాల భూపాల్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు సామ రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు, నాయకులు రావుల రైతులు పాల్గొన్నారు.

భువనగిరిలోని ఓ హోటల్ యాజమానికి జరిమానా విధిస్తున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి

పరిశుభ్రత, నియమాలు పాటించకుంటే చర్యలు

- పలు హోటళ్లకు జరిమానా

భువనగిరి అర్బన్, నవంబర్ 2 : హోటళ్లలో యాజమాన్యం పరిశుభ్రత, నియమాలు పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ ఎం.సుమన్‌కళ్యాణ్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి అన్నారు. భువనగిరి పట్టణంలోని పలు హోటళ్లలో శనివారం వారు తనిఖీలు నిర్వహించారు. నిల్వ ఉంచిన, పాడైన ఆహార పదార్థాలను సీజ్ చేసి డంపింగ్‌యార్డుకు తరలించాలని సూచించారు. ఇందులో భాగంగా మధురం రెస్టారెంట్‌కు రూ.10వేలు, మండి బిర్యానీ హోటల్‌కు రూ.7వేలు, శివ ఉడిపి హోటల్‌కు రూ.15వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోటళ్లలో తాజా కూరగాయాలు, వంటలో వాడే ఆహార పదార్థాలు, వెజ్, నాన్‌వెజ్ వంటిని ఏరోజుకారోజు తేవాలని, నియమాలు పాటించకుంటే జరిమానాతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌జీటీ టీచర్ల భర్తీ

- 40 మందికి ఆర్డర్ కాపీలు అందజేత

రామగిరి, నవంబర్ 2 : డీఎస్సీ-2024 ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిన ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు ఎంపికైన జాబితాను రాష్ట్ర విద్యాశాఖ శనివారం సాయంత్రం విడుదల చేసింది. నల్లగొండ జిల్లాలో 40 స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌జీటీ పోస్టులు ఖాళీగా ఉండగా 1:3 పరిశీలనకు హాజరైన వారిలో 40 మందిని ఎంపిక చేశారు. వారిలో ఇద్దరికి ప్రభుత్వ, 38 మందికి లోకల్ బాడీలో టీచర్ పోస్టులు కల్పిస్తూ ఉత్తర్వులను డీఈఓ భిక్షపతి అందజేశారు. వీరంతా సోమవారం ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరనున్నారు.

అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేస్తున్న డీఈఓ భిక్షపతి

ఎమ్మెల్యే సామేల్ తీరుపై పీసీసీకి ఫిర్యాదు

అర్వపల్లి, నవంబరు 2 : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వ్యవహరిస్తున్న తీరుపై అదే పార్టీకి చెందిన కాంగ్రెస్ సూర్యాపేట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ధరూరి యోగానంద చార్యులు శనివారం గాంధీభవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గత కొన్ని నెలలుగా తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీకి వలస వచ్చినవారు ఎమ్మెల్యేకు కోటరిగా వ్యవహరిస్తూ పార్టీకి నష్టం కలుగజేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ముందు నుంచి పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇంతకు ముందుకు ప్రకటించినట్టుగా పాలకుర్తి రాజయ్య కుటుంబ సభ్యులకే ఇవ్వాలని గుర్తుచేశారు. పీసీసీ అధ్యక్షుడు సానుకూలంగా స్పందించి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్వపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపాక సత్యం, మండల సీనియర్ నాయకులు, రత్నం, సంతోశ్ ఉన్నారు.

4న బీసీ కమిషన్ చైర్మన్ రాక

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 2 : ఈ నెల 4న నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అందుబాటులో ఉంటారని బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బీసీ సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇతరులు ఏమైనా ఫిర్యాదులు ఉంటే మధ్యాహ్నం 2:30 నుంచి 4 గంటల వరకు రాత పూర్వకంగా సమర్పించాలని పేర్కొన్నారు. ఈ నెల 4న అనివార్య కారణాలతో ఫిర్యాదులు ఇవ్వని వారు తిరిగి 12న హైదరాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదులను అందించాలని తెలిపారు.

పరేడ్ గ్రౌండ్ పేరుతో హోంగార్డుల కట్టడి

- డ్యూటీలు వేసి చలో ఇందిరా పార్క్‌కు వెళ్లకుండా నిలువరింపు

నీలగిరి, నవంబర్ 2 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హోంగార్డుల సంఘం ఇచ్చిన చలో ఇందిరాపార్కు కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ యంత్రాంగం శనివారం పరేడ్ పేరుతో ఎక్కడికక్కడ అడ్డుకున్నది. అన్ని పోలీస్‌స్టేషన్లలోని హోంగార్డులు జిల్లా పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే పరేడ్ కార్యక్రమానికి కచ్చితంగా హాజరు కావాలని హుకూం జారీ చేసింది. దీంతో ప్రతి హోంగార్డు ఆయా పోలీస్ స్టేషన్లు, జిల్లా పరేడ్ గ్రౌండ్‌కు హాజరుకావడంతో వారికి డ్యూటీలు వేశారు. కచ్చితంగా విధులు నిర్వర్తించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేయడంతో వారు చేసేది లేక విధులు నిర్వర్తించారు. జిల్లా నుంచి ఇందిరాపార్కు కార్యక్రమానికి వెళ్లలేదు.

హోంగార్డు ముందస్తు అరెస్టు

తిరుమలగిరి : మండల పరిధిలోని కన్నారెడ్డికుంటతండాకు చెందిన హోంగార్డు భూక్య సోమ్లానాయక్ భువనగిరిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా శనివారం తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద హోంగార్డులు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి తన నివాసం నుంచి బయల్దేరుతున్న క్రమంలో తిరుమలగిరి పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా హోంగార్డు సోమ్లానాయక్ మాట్లాడుతూ అధికారంలోని వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేసాడు.

తిరుమలగిరిలో హోంగార్డును అరెస్టు చేసిన పోలీసులు